# నాన్ రెసిడెంట్ ఇండియన్‌ల కథలకి రిటర్న్‌డ్ ఇండియన్ ముందుగా చెప్పే మాట

అమెరికా వెళ్ళటానికి ముందు కథల్ని 'అమెరికా మజిలీ కథల'ని ఒకరు వ్రాస్తే, వెళ్ళి అక్కడ ఉండిపోయిన వాళ్ళ కథలు మరొకరు వ్రాసారు. మొదటి 'ఒకరు' రెండో 'మరొకరి' పుస్తకానికి ముందు మాట వ్రాయటం కాకతాళీయం కాదు. 'శాయి' లాలూచీయం.

అరోకల్(Oracle)కాలంలో ఇండియా జనం విజృంభించి దేవలోకం అయిన అమెరికాలోని క్లాస్ జనంలో చేరిపోవటానికి ప్రయత్నిస్తుంటే, మాస్టర్స్ ఆఫ్ మాస్ సైకాలజీ వాళ్ళని క్లాసులోకి రానిచ్చి బెంచెక్కించేయటం గురించిన కథ ఇందులో రెండోది.

బోలెడు డబ్బు పోసి కొనుక్కున్న మొగుళ్ళనందరు ఎన్నా? రైలా? అని అడుగుతుంటే 'కాదు విమానందా!' అని గర్వంగా జవాబిచ్చేస్తూ వైతరణి దాటడానికి గోవు తోక పుచ్చుకొన్న వారిలా నిబ్బరంగా మొగుళ్ళ చేతులందుకొని అమెరికా పరుగులెత్తిన అమ్మణులలో కొందరు పాచిపని నుంచి పాకీపని దాకా ఆ ఏకశాల గృహాల్లో ఠీవిగా నిర్వహిస్తూ గుంభనంగా స్టైలు వెళ్ళబోస్తుంటే, అబద్ధాలాడటమే అవమానంగా తలిచే మరికొందరు అబద్ధాల జీవితం భరించలేక భర్తలతో కలిసి ఆత్మహత్య చేసుకోవటం గురించి ఈ కథల్లో చదువుతాం.

కొన్ని మందపాటి సత్యాలు (పద)మూడు ఎన్నారైలుగా; ఆరు (ఇతర) కథలుగా ఇందులో అచ్చయ్యాయి. ప్రతి మనిషికో చరిత్ర, అప్లై చేసిన ప్రతీ వీసాకి ఓ కొత్త సమస్య! పాముల నోట పడకుండా నిచ్చెనెక్కితే పరమపద (సోపాన) సాహస యాత్ర పూర్తయినట్టే! ఇంతాచేసి ఈ అమరేశ్వరం పోయినా అసూయల్లాంటి శనేశ్వరాలు మన లగేజిలో ఎకంపెనీడ్‌గా వచ్చేస్తాయి. వాటిని వదుల్చుకోటం ఓ 'పాట' భారతం. ఉన్న కూతురు, కొడుకూ అమెరికాలో సెటిల్ అయిపోయిన కన్నతల్లికి, పిల్లల్ని కనని తల్లికి ఈ రోజుల్లో మన (భారతదేశంలో పెద్ద తేడా లేదని అద్దానికి అవతలివైపు చూడగలిగితే తెలుస్తుంది.

'ఎన్నారై కథలు' చెప్పటానికి సూతుడ్ని అద్దెకున్నారు సత్యంగారు. 'అమెరికా మజిలీ కథల్ని' చెప్పటానికి సిద్ధయ్యను ముందేసుకున్నాడు కవనశర్మ. ఈలాంటి కథల్లో వ్యాఖ్యానం అవసరం అవుతుంది. అది రచయిత చేస్తే విమర్శకుడు విసుక్కుంటాడు. అందుచేత రచయిత మూడోవాడి (third person) చేత చెప్పిస్తాడు. అటువంటప్పుడు పాఠకులు విసుక్కుంటారు! ఇందులో ఎక్కడైన పాఠకులకి కొద్దిపాటి అసౌకర్యం కలిగితే కథారచయిత బయటపడరాదు అంటూ అతగాడికి విమర్శక పండితులు పెట్టిన ఆంక్ష వల్లేనని గుర్తుంచుకోవాలి. ఎందుకంటే

చెప్పిన విషయాలు అక్షరాల సత్యాలు, చెప్పినదెవరైనా.

ఇందులో ఉన్న మరో ఆరు కథల్లో రెండు కథలు గురించి తప్పకుండా చెప్పుకోవాలి. అందులో మొదటిది 'మానవతకి మరో వసంతం'. ఒక దేహాన్ని మరో దేహం తాలుకు భాగాలతో బతికించవచ్చు. అయితే స్వీకరించిన దేహం దాన్ని విసర్జించాలని చూస్తూనే ఉంటుంది. అందుచేత డొనేషన్, బతుకుని కొద్దిగా మాత్రమే పొడిగిస్తుంది. ఒకోసారి చేసిన త్యాగానికి ఫలితం లేకుండా పోతుంది. వసంత బోన్‌మేరో ఇచ్చి బతికించిన అబ్బాయి కొద్ది కాలమే బతికి చనిపోతాడు. మనస్ఫూర్తిగానే ఆమె ఇచ్చినా ఆ పిల్లాడు ఎందుకు చనిపోయాడోనన్న ఆలోచన ఆమెను దుఃఖితురాలను చేస్తుంది. అప్పుడు ఆమెకి, "పని చెయ్యటమే మనవంతని ఫలితం మన చేతుల్లో లేదని, మంచి పనిచేసామన్న తృప్తే మనకి ముట్టే పారితోషికం" అని తెలియచెప్పబడ్తుంది. ఈ కథ పాఠకులని ఆలోచింపచేసే కథ. కర్తవ్యోన్ముఖులను చేసే కథ. భగవద్గీతకి మరో భాష్యం.

రెండో కథ ఒడిలో విడిచిన పసితనం. డబ్బున్నంతమాత్రాన ఉన్నవాళ్ళు ఇవ్వరు. ఇచ్చే గుణం ఉన్నవాళ్ళు ఉన్నంతలో ఇస్తూనే ఉంటారు. ఇచ్చే తల్లి దగ్గర నుంచి ఇవ్వగల మనసుని పొందాలనుకొన్న కూతురు కథ. రసభావరంజిత దృష్టితో చెప్పిన కథ.

పై రెండు కథల్లోను ఇచ్చే మనస్సున్న వసంత, పూర్ణమ్మ పాత్రలు గుర్తుంటాయి. చెట్లు మనల్ని ఎందుకు సేద తీరుస్తాయి? ఏ ప్రతిఫలం గురించి? వీరూ అంతే!

మందపాటి వారి కథల్లో సత్యాలు మానవతా విలువలు మాత్రమే కాదు కొట్టవచ్చినట్టు కనిపించేవి, చమత్కారాలు బోలెడు కూడా!

*'దిగంబర మునులు చల్ల కోసం వెళ్ళినప్పుడు ముంత దాచలేరు కదా!'* (అంతా బట్టబయలే!) లాంటివి.

*'కిందటేడు ఈ యేడాది ఇండియా వెళ్ళిపోవాలనుకొన్నాం. ఈ యేడాది వచ్చే యేడు అనుకొంటున్నాం. ఉండం కనక ఏమీ కొనుక్కోం. వెళ్ళం కనక ఏమీ లేకుండా ఉండి కష్టపడ్తాం!'* అంటూ ఎన్నారైల్లో ఒక వర్గం వారి జీవితాల్ని మనకు చూపిస్తారు సానుభూతి కలిగేలా.

*'గొంగళి పురుగు నిండుగ గొంగళి కప్పుకొని వెచ్చ బబ్బుంది'*లాంటి ఉచితమైన ఉపమానాలూ ఉన్నాయి కథల్లో.

ఈ పుస్తకం తెలుగువారందరి కోసం కాదు! 'కొని' చదవగల కొందరి కోసమే!

కవనశర్మ విశాఖపట్నం